లింగ నిర్ధారణ నేరం

ప్రజాశక్తి – కాకినాడరూరల్

రోగ పీడిత శిశు పిండాలను కనుగొని తొలగించడం కోసం లింగ నిర్ధారణ పరీక్షలు అవసరమని, కానీ గర్భస్థ పిండం ఆడ లేక మగ నిర్ధారించి ఆ విషయాన్ని తెలియపరచడం నేరమని న్యాయవాది యనమల రామంతెలిపారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్కానింగ్‌లో ఆడపిల్ల అని చెబితే గర్భస్రావాలు, భ్రూణ హత్యలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. దీంతో ఆడ మగ శిశువుల జనన శాతంలో భారీ వ్యత్యాసం ఉంటుందన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు నియమ నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. కానీ కొందరు డబ్బు తీసుకొని వెల్లడిస్తున్నారని, ఇది నేరమని అన్నారు. పిండ దశలో హతమార్చడం కూడా చట్టరీత్యా నేరమని యనమల తెలిపారు. అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లు సరఫరాకు చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి అధికారుల్లో స్పందన

రాజపూడిలో గుడ్లు రీప్లేస్ చేస్తున్న పౌల్ట్రీ నిర్వాహకులు

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన 'గుడ్డు వెరీ బ్యాడ్' కథనానికి ఐసిడిఎస్ అధికారులు స్పందించారు. నాణ్యతగల గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఎం.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న రంగంపేట ఐసిడియస్ ప్రాజెక్టు సమావేశంలో జగ్గంపేట మండలంలోని రామవరం -2, మల్లిసాల -3, గండేపల్లి మండలంలోని జెడ్.రాగంపేట కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లు పాడయ్యాయని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలియజేసిన వెంటనే మరలా తాజా గుడ్లు సరఫరా చేయవలసిందిగా సంబంధిత సత్యా భాస్కర్ పౌల్ట్రీ నిర్వాహకులను ఆదేశించామన్నారు. దాంతో వారు మంగళవారం నాణ్యత గల గుడ్లు సరఫరా చేసినట్లు తెలిపారు. గుడ్లు సరఫరా చేసే ముందు ప్రతీ సారీ పౌల్ట్రీలో 3 దఫాలుగా తనిఖీ చేసి బరువు తూచి సరిగా ఉన్న తరువాత గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గుడ్లు సరఫరాకు ముందు వర్కర్లు నాణ్యత, బరువు ధ్రువీకరించుకో వాలని కోరారు. గుడ్లు ఉడికించి లబ్దిదారులకు ఇచ్చే సమయంలో కూడా నాణ్యత సూత్రాలు పాటించి ఇవ్వాలని ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. సప్లయ నుంచి లబ్ధిదారుకు చేరే వరకు ప్రతి దశలోనూ పర్యవేక్షణ చేస్తున్నామని వివరణ ఇచ్చారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల కారణంగా గుడ్లు త్వరగా పాడైపోయే అవకాశం ఉన్నందున కాలయాపన లేకుండా త్వరితగతిన నాణ్యమైన గుడ్లు అందేటట్లు చూస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, 0–3 ఏళ్ల పిల్లలకు నాణ్యమైన ఆహారం, గుడ్లను సరఫరా చేస్తున్నట్లు సామర్లకోట రూరల్ సిడిపిఒ జివి రమణమ్మ చెప్పారు. గుడ్డు వెరీ బ్యాడ్ అన్న శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తా కథనంతో సిడిపిఒ రమణమ్మ, సూపర్‌వైజర్లు స్పందించి మండలంలోని ఉండూరు గ్రామంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి పరిశీలించారు. కోడి గుడ్లు బరువు, నాణ్యతను పరిశీలించారు. ఒక్కో ట్రేలో 30 గుడ్లు బరువు 1550 నుండి 1650 గ్రాములు ఉన్నట్లుగా గుర్తించా మన్నారు. ప్రతి నెల మొదటి వారంలో నీలి రంగు, 2వ వారంలో గులాబీ రంగు, 3వ వారంలో ఆకుపచ్చ రంగు గుడ్లును సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. గుడ్ల గోడౌను నుండి వచ్చే ముందు బరువు, నాణ్యతను సిడిపిఒలు చూసిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నామన్నారు. వేసవి సందర్భంగా అక్కడక్కడ గుడ్లు పాడైపోవచ్చు అయితే ఈ తనిఖీల్లో నాణ్యత బాగానే ఉన్నట్లు సిడిపిఒ చెప్పారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యతపై తల్లులను, లబ్దిదారులను సమా వేశ పరిచి అవగాహన కల్పిం చారు. గుడ్ల నాణ్యతలో ఎటు వంటి లోపాలు లేవని చెప్పారు. కార్యక్రమంలో సిడిపిఒ వెంట సెక్టార్ సూపర్ వైజర్ ఎస్. కుసుమ కుమారి, జిఎం ఎవికెలు కరీమున్నీసా, నాగ లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఉండూరు అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు చేపడుతున్న సిడిపిఒ రమణమ్మ

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- ఎపిజెఎసి అధ్యక్షుడు బొప్పరాజు

- కాకినాడలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ధర్నా

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికులు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని ఎపిజెఎసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ఎపిజెఎసి ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కాకినాడ లోని ధర్నా చౌక్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి పలు ప్రజాసంఘాలు, సిపిఎం, సిపిఐ, సిఐటియు, గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించి అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. రెగ్యులర్, సిపిఎస్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, కంటింజెంట్, టైమ్ స్కెల్, రోజువారీ వేతన జీవులు, ఉపాధ్యాయులు, కార్మికులు, స్కీమ్ వర్కర్లు, పెన్షనర్స్ సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర ఆదాయం రూ.లక్ష కోట్లు అయితే ఉద్యోగులకే రూ.90 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆర్థిక మంత్రి బుగ్గన చెప్పడం దారుణమన్నారు. వాలంటీర్ల జీతాలతో పాటు, సలహాదారులు, స్పెషలిస్టులు, ఎపి ఉద్యోగులకు చెల్లించే మొత్తం రూ.60వేల కోట్లకు మించి ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకు గత చర్చల్లో ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఎపిజెఎసి అమరావతి ఉద్యమంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద రెగ్యులర్ చేయాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని,సీనియర్స్‌కు వార్షిక ఇన్‌క్రిమెంట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఉద్యోగ సంఘాలు పోరాటాలు జరిపిన ఫలితంగా అనేక ప్రయోజనాలు పొందామని, ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం తప్పనిసరిగా అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని,12వ పిఆర్‌సి నియమించాలని, పెన్షనర్లకు డిఆర్ ఏరియర్స్ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే ఫలితాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్ల న్యాయమైన కోర్కెల సాధనకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు, సంసాని శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, సిహెచ్ రాజకుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు మోహనరంగా, శివాజీ, శ్రీనివాస్, ఆర్‌టిసి డ్రైవర్ల సంఘం నాయకులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు మొత్తం 800 మంది ధర్నాలో పాల్గొన్నారు.

కాకినాడ లోని ధర్నా చౌక్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు



సమావేశంలో పాల్గొన్న ఎంపి గీత, కలెక్టర్ కృతికా శుక్లా ఎస్‌పి సతీష్ కుమార్, డిఆర్‌ఒ శ్రీధర్‌రెడ్డి

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం

ప్రజాశక్తి – కాకినాడ

కాకినాడ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా, పరిహారం అందేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ ఎంపి వంగా గీత అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వివేకానందహాల్‌లో కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్) సమావేశంలో ఎంపి గీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసనమండలి సభ్యులు చిక్కాల రామచంద్రరావు, ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్, సమన్వయ శాఖల అధికారులు హాజరయ్యారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలపై కార్యాచరణను సాంఘిక సంక్షేమ శాఖ జెడి జె.రంగలక్ష్మీదేవి వివరించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ కాకినాడ జిల్లా తొలి కలెక్టర్ కృతికా శుక్లా సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. కాకినాడలో రూ.100 కోట్లతో చేపట్టిన ఇఎస్‌ఐ ఆసుపత్రి పనులు 80 శాతం మేర పూర్తయ్యాయని త్వరలోనే ఇది ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా కషిచేస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్ కృతిక మాట్లాడుతూ ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 1,396 మంది ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు త్వరలోనే 1,500 ఎకరాల భూమిని పంపిణీ చేయనున్నట్టు, రూ.3.60 కోట్లతో ఏడు సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని, కత్తిపూడి బాలుర హాస్టల్, శంఖవరం బాలుర హాస్టల్, తుని బాలికల హాస్టల్ కొత్త భవనాలకు రూ.60 లక్షల చొప్పున జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎస్ఆర్ కింద రూ.60 లక్షలతో జగన్నా యక్‌పూర్ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. బాలాజీచెరువు సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర హాస్టల్ పనులకు రూ.కోటి ఎంపి, ఎంఎల్ఎల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో 2020 నుంచి ఇప్పటి వరకు బాధితులకు దాదాపు రూ.3.17 కోట్ల మేర పరిహారం అందించామన్నారు. ఇటీవల శృంగవృక్షం ఘటనకు సంబంధించి బాధిత కుటుంబానికి సహాయాన్ని అందించామన్నారు. గ్రామాల్లో పీస్ కమిటీల సమావేశాలు నిర్వహించి అట్రాసిటీస్ చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కాకినాడ ఎస్‌పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2013 నుంచి ఇప్పటి వరకు చూస్తే ప్రస్తుతం 39 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ)లో ఉన్నాయని వివరించారు. కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శృంగవక్షం ఘటనలో 11 మందిని అరెస్టు చేశామని ప్రస్తుతం ఈ కేసును సీబీ–సీఐడీ దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సమావేశంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, డాక్టర్ మోకా పవన్ కుమార్, బండి వీరలింగేశ్వ రరావు, గంగవంశం త్రినాథ్‌దేవ్, పిల్లి జ్యోతి హాజరయ్యారు. యుద్ధప్రాతి పదికన కేసుల విచారణ, వివిధ కేసుల్లో పురోగతి, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్య భద్రత, పందుల పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకా శాలు, అన్నమ్మ ఘాటీ చెరువు పనులు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశాలపై చర్చించారు. సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన అంశాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో పెద్దాపురం ఆర్‌డిఒ కాకినాడ ఇన్‌ఛార్జ్ ఆర్‌డిఒ జె.సీతారామా రావు, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి అప్పారావు, డీఎల్‌డిఒలు పి.నారాయణ మూర్తి, కెఎస్ఎన్‌వీ ప్రసాద్, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, హౌసింగ్, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు బి.సుధాకర్ పట్నాయక్, కె.ప్రవీణ, కె.శ్రీరమణి, బి.ప్రియవద, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవి, సిపిఒ పి.త్రినాథ్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.రమేష్ హాజరయ్యారు.

ధర్నా చేస్తున్న వికలాంగులు, సంఘం నాయకులు

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు పునరుద్ధరించాలి

జెఎసి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నిరుద్యోగుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

స్థానిక వికలాంగులు, వయోవద్ధుల సహాయ సంస్థ కార్యాలయం వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వికలాంగ నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు జిల్లా అధ్యక్షులు మండపాక అప్పన్న దొర ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా టిడిపి వికలాంగుల కమిటీ పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి రూ.200ల పింఛన్ రూ.500 చేస్తే రూ.500 నుండి 3000 చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని ఈ ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలయినా వికలాంగులకు ఒక రూపాయి పింఛన్ పెంచలేదు కానీ నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచిందన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు ఎక్కడ ఒక ఉద్యోగం కూడా వికలాంగులకు కల్పించలేదని, వివాహ ప్రోత్సాహం పదో క్లాస్ పాస్ అవ్వాలని ఆంక్ష విధించడం ఎంతవరకు సమంజ సమని, చదువుతో పని లేకుండా అర్హులందరికి వివాహ ప్రోత్సాహం అందించాలని అన్నారు. సమస్యలు తీర్చకుంటే తీవ్రమైన పోరాటాలు చేస్తామనికార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి వికలాంగుల సంఘం కార్యదర్శి ఎస్‌కె. కరీముల్లా, ఉపాధ్యక్షులు నరం శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర నాయకులు గింజల దుర్గాప్రసాద్ యాదవ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెఎసి ప్రధాన కార్యదర్శి పొలమూరి పెద్దకాపు, చైర్మన్ గుణపర్తి కొండలరావు, సభ్యులు జలతారపు వెంకన్న, మంద అప్పారావు, ఆర్ నాగేశ్వరరావు, చింతపల్లి పవన్ పాల్గొన్నారు.

పటిష్టంగా వికలాంగ హక్కుల చట్టం అమలు

ప్రజాశక్తి – కాకినాడ

వికలాంగుల హక్కుల చట్టం–2016 పటిష్టంగా అమలు అయ్యేలా రెవెన్యూ, పోలీస్, వికలాంగులు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, ఐసిడిఎస్ తదితర సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శు క్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి వికలాంగుల హక్కుల చట్టం–2016, చట్టం పటిష్ట అమలుకు రూపొందించిన నియమావళి అమలుపై సమన్వయ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం–2016లోని సెక్షన్ 72 మేరకు వికలాంగుల హక్కుల పరి రక్షణ, సంక్షేమానికి జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో జిల్లా ఎస్‌పి, ఆసుపత్రి సేవల సమన్వయకర్త, డిఆర్‌డిఎ పీడీ, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి, ఎల్‌డిఎం, మెప్మా పీడీ, ఐసిడిఎస్ పీడీ తదితరులతో పాటు విక లాంగుల సామాజిక స్థితిగతులు, అభివృద్ధిపై అపార అనుభవమున్న వారిని, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కూడా కమిటీలో సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ ఆరు నెలలకోసారి సమావేశమై చట్టం అమలు పురోగతిపై సమీక్షించనున్నట్లు వెల్లడించారు. వికలాంగు లపై వివక్ష ఏ రూపంలో ఉన్నా తొలగించాల్సిందేనని వారి అర్జీల పరిష్కారానికి ప్రతి శాఖ నోడల్ అధికారిని నియ మించాలని ఆదేశించారు. వారికి విద్య, వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. వారిలో నైపు ణ్యాలు పెంపొందించి వారు ఉపాధి అవకాశాలు పొందేలా, క్రీడల దిశగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. కార్యా లయాల్లో వారు పనిచేసేందుకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు. పాఠశాలల్లో భవిత కేంద్రాలను పటిష్టం చేసేందుకు కషిచేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విక లాంగులకు అందుబాటులో ఉన్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంపొందించి, వాటిని సద్వినియోగం చేసు కునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ కృతికాశుక్లా సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.రమేష్, డిసిహెచ్ఎస్ డాక్టర్ బి.విష్ణువర్ధిని, డిఎస్‌పి రాంబాబు, డిప్యూటీ డిఇఒ డేనియల్‌రాజు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడి రామారావు, ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ప్రతినిధి ఎస్.అప్ప లనాయుడు, మహర్షి సాంబమూర్తి, వికలాంగ బాలికల రెసి డెన్షియల్ స్కూల్ హెచ్‌ఎం ఎం.సుబ్బలక్ష్మి హాజరయ్యారు.

మేడే కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బేబీ రాణి, ఆశావర్కర్లు

మేడేను విజయవంతం చేయాలి

-ఆశ వర్కర్స్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి – కాకినాడ

ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం స్థానిక సిఐటియు ఆఫీసు నందు నర్ల ఈశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు జి బేబీ రాణి మాట్లాడుతూ 8 గంటల పని దినం కోసం జరిగిన కార్మిక పోరాటం మే డేగా ప్రసిద్ధి కెక్కిందని, ప్రపంచంలోనే అన్ని దేశాలలో కార్మిక వర్గం 8 గంటల పని దినాన్ని సాధించిందన్నారు. పనిగంటలే కాకుండా ఇతర హక్కులను కూడా సంపాదించిందన్నారు. నేడు కార్మిక హక్కులను నిలుపుకునేందుకు మరో పోరాటం చేయవలసిన అవసరం ఉందని, అందుకని మేడే దినోత్సవాన్ని కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, గ్రూప్ ఇన్స్యూరెన్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ మాట్లాడుతూ మేడే దినోత్సవాన్ని ప్రతి గ్రామంలోనూ, ప్రతి పీహెచ్సీల దగ్గర జెండాను ఎగరవేసి మే డేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆర్.నాగలక్ష్మి, అంకాడి పద్మ, ఎం ఆశాజ్యోతి, అనంతలక్ష్మి మంగారత్నం, ఉమాదేవి, గ్రేస్ పాల్గొన్నారు. **పెద్దాపురం** యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం యూనియన్ అధ్యక్షులు పుప్పాల సావిత్రి అధ్యక్షతన పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీల సమావేశం నిర్వహించారు. మేడే వేడుకల్లో అంగన్‌వాడీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పెద్దాపురం ప్రాజెక్టు కార్యదర్శి దాడి బేబీ అన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు యాసలపు సూర్యారావు భవనం నుండి ప్రారంభ మయ్యే ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఉమామహేశ్వరి, రమణమ్మ, చక్రవేణి, సత్యనారా యణమ్మ, మార్త పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ప్రత్తిపాడు భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో జరిగిన సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు మే ఒకటో తేదీన జరిగే ర్యాలీలో పాల్గొనాలన్నారు. తొలుత కార్మిక సంఘం భవనం వద్ద జండా ఆవిష్కరించి అనంతరం ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నెట్ల శ్రీను, సిఐటియు నాయకులు బి.సురేష్, పి.రాంబాబు సిహెచ్ వెంకటలక్ష్మి పి వరలక్ష్మి, కె.పార్వతి పి.రమణ పాల్గొన్నారు.

మలేరియా నివారణపై ర్యాలీలు

ప్రజాశక్తి – యంత్రాంగం

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ముఖ్య కేంద్రాల్లో పిహెచ్‌సి, సిహెచ్‌సిల సిబ్బంది మలేరియా వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ఏలేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

తాళ్లరేవు మండలం గాడిమొగ పిహెచ్‌సి ఆధ్వర్యంలో తాళ్ళరేవు మెయిన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు పెరగకుండా పరిసరా లలో పరిశు భ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. నీటి నిల్వలు లేకుండా ఎప్పుడు కప్పుడు తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, తహశీల్దార్ పోతురాజు, గాడిమొగ పిహెచ్‌సి హెల్త్ సూపర్వైజర్ ఎం.ఇబ్రహీం, పి.హెచ్. ఎన్.సుభాషిణి, హెల్త్ ఎడ్యుకేటర్ సీతామహలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్లు రంజన్, రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్లు కె.ఆంజనేయులు, అలీషా, ఆదినారాయణ, అభినవ్, శ్రీనివాస్, ఎఎన్ఎంలు భవాని, జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ వర్కర్లు, అంగన్ వాడీలు పాల్గొన్నారు. **గండేపల్లి** పిహెచ్‌సి వైద్యాధికారిని డాక్టర్ సౌమ్య అధ్యకతన సమావేశం నిర్వహించి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మలేరియా వ్యాధి నిర్మూలన, ప్రజల్లో అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి చందన, సూపర్వైజర్లు రూతమ్మ, చెల్లారావు హెలినా, ఎంఎల్‌ఎహెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** కమిషనర్ కే ఏ కొండలరావు ఆధ్వర్యంలో వైద్యాధికారి శ్రీలక్ష్మి, డాక్టర్ పాపారావు, మలేరియా యూనిట్ అధికారి ఆనంద్ ఎంపిహెచ్ఇఒ భాస్కరరావు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తాళ్లరేవులో ర్యాలీ నిర్వహిస్తున్న గాడిమొగ పిహెచ్‌సి సిబ్బంది

కార్టూ'నిజం'

వింతేముంది? క్లోనింగ్ అవసరం లేకుండానే.. మన ఖాతాల్లో సొమ్ము మాయం కావడంలా..!!!

ప్రజా ఉద్యమ నాయకుడు వసంత్‌కుమార్

వసంత్‌కుమార్

ప్రజా ఉద్యమ నాయకుడు వసంతకుమార్‌తో పరిచయం మరిచిపోలేనిది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉండగా ఎస్ఎఫ్ఐ సమావేశాలు, ఇతర శిక్షణా తరగతులు కాకినాడ సుందర్య భవన్ జరిగేవి. ఈ సమావేశాలకు వసంతకుమార్ కూడా వస్తూ ఉండేవారు. ఆ సమయంలో ఎస్ఎఫ్ఐ నాయ కునిగా ఉన్న రాజులోవతో ఆయన మాట్లాడుతూ ఉండేవారు. ఈ సందర్భంగా వసంత కుమార్‌ను రాజులోవ నాకు పరిచయం చేశారు. అప్పటి నుంచి కాకినాడ వచ్చిన ప్రతిసారి చిరునవ్వుతో తమ్ముడు అంటూ ఆయన నన్ను పలుకరించేవారు. విద్యార్థి సంఘం నిర్మాణంతోనే పార్టీ అభివృద్ధి చెందుతుందని తరచూ ఆయన చెప్పేవారు. అమలాపురంలో విద్యార్థి సంఘం నిర్మాణం కోసం రావాలని పదేపదే అడుగుతూ ఉండేవారు. 2016లో ఉద్యమ అవసరాల రీత్యా జిల్లాల విభజన జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జిల్లా, రాజమహేంద్రవరం జిల్లాగా ఏర్పడ్డాయి. కాకినాడ జిల్లాలో కోనసీమ ఏరియా కూడా కలిసి ఉంది. ఎస్ఎఫ్ఐ కూడా రెండు కమిటీలుగా ఏర్పాటయ్యాయి. కాకినాడ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా ఉండగా అమలా పురం వెళ్లాను. అక్కడ సంఘం నిర్మాణం కోసం వసంత్‌కుమార్ సహకారం మరువలేనిది. తొలుత బండారులంకలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. వసంత్‌కుమార్‌కు ఉన్న పరిచాయలతో సమనస, వన్నెచింతలపూడి, తాండవపల్లి తదితర గ్రామాల్లో తిరిగాం. ఏ గ్రామానికి వెళ్లినా వసంతకుమార్‌ను ప్రజలు ఆప్యాయంగా పలుక రించేవారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజా వచ్చాడు. మీ పిల్లలు చదువులు, భవిష్యత్తు కోసం మాట్లాడతారు. మీ పిల్లల్ని పిలవండి అని చెప్పగానే వారు పిల్లలందరినీ పిలిచేవారు. వాళ్లతో మాట్లాడి స్థానికంగా కమిటీలు ఏర్పాటు చేశాం. అమలాపురం నుంచే రాజోలు, మల్కిపురం మండలాల్లో కూడా పర్యటించాం. కాకినాడ జగన్నాధపురంలో ఉన్న ఆంధ్ర పాలిటెక్నిక్‌లో వసంత కుమార్ కుమారుడు లెనిన్ చదువుతుండేవాడు. తన కుమా రుడిని ఎస్ఎఫ్ఐకు పరిచయం చేశారు. కాకినాడ పాలి టెక్నిక్ పూర్తిచేసుకుని అమలాపురం ఏరియాలో బివిసి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న సమయంలో లెనిన్ ఎస్ఎఫ్ఐకు మరింత ఆకర్షితులయ్యారు. దొరబాబు, శంకర్, లెనిన్, రాం ప్రసాద్, వెంకటేష్, సాయి ప్రణీత్‌తో ఒక టీం ఏర్పాటు చేశాం. ఆరేళ్ల కాలంలో అమలాపురం కేంద్రంగా ఎస్ఎఫ్ఐ జిల్లా క్లాసులు, జిల్లా సదస్సు, జిల్లా మహా సభలు, సమావేశాలు నిర్వహించాం. వసంత్‌కుమార్, రాజశేఖర్, రమణి, వెంకటేష్, వరలక్ష్మి వీటిని సహకరించారు. వసంత్‌కుమార్ విద్యార్థి సంఘం, సిఐటియు, కౌలు రైతు సంఘం, కెవిపిఎస్ నాయకునిగా పని చేశారు. అన్ని ప్రజాసంఘాల్లో తనదైన ముద్ర వేశారు. ప్రజలను, కార్మికులను, రైతులను ఐక్యంచేసి అనేక ఉద్యమాలు చేసిన విప్లవకుమార్‌కి విప్లవ జోహార్లు....

- టి.రాజా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు

400 మందికి ఆహారం అందజేత

ప్రజాశక్తి – గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎమర్జెన్సీ బ్లడ్ గ్రూప్ సభ్యులు సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, దేవి ఆధ్వర్యంలో నవ సేవ విమెన్ ట్రస్ట్, చేయూత చిల్డ్రన్ హోమ్, శ్యామ్ ట్రస్ట్ తదితర సంస్థలలో విద్యార్థులకు, వృద్ధులు 400మందికి ఆహార పొట్లాలను, వాటర్ బాటిల్స్ అందజేశారు. తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లా డుతూ సత్ సంకల్పంతో 'ఎమర్జెన్సీ బ్లడ్ గ్రూప్' పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసి, విద్యార్థులు వారి పాకెట్ మనీలో కొంత మొత్తాన్ని సంస్థకోసం నిధిగా సమకూర్చుకుని ప్రతి నెల పేదలకు, వృద్ధాశ్రమంలోని వద్దులకు, హాస్టల్ విద్యార్థినీ, వ్యిర్థులకు అన్నదానం చేస్తున్నా రన్నారు. ప్రమాదంలో రక్తం అవసరమైన వారికి తమ గ్రూప్ సభ్యులకు తెలియజేస్తే వెంటనే రక్తదానం చేసి సహాయ పడటం, పేదలకు ఆహారాన్ని అందివ్వడం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి విద్యార్థులను అభి నందించారు. కార్యక్రమంలో పెనుమల్లు నిశాంత్ రెడ్డి, జాన్ వెస్లీ, సాధ్విక పాల్గొన్నారు.

వృద్ధులకు జోళ్లు పంపిణీ చేస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

వృద్ధులకు చెప్పుల పంపిణీ

ప్రజాశక్తి – కాకినాడరూరల్

రమణయ్యపేట ఏపీఐఐసీ ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ రోజురోజుకీ ఎండలు పెరుగుతున్నందున వడదెబ్బకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు, రేలంగి పాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ నుంచి జారిపడి జట్టు కూలీ దుర్మరణం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఇంజన్ సీటులో కూర్చున్న జట్టుకూలీ ప్రమాదవశాత్తూ జారిపడి దుర్మరణం చెందిన సంఘటన ఇది. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం కెనాల్ రోడ్డులో ట్రాక్టర్‌పై అడ్డతీగల నుండి రామచంద్రపురం వెళుతుండగా, ఇంజన్ సీటులో కూర్చున్న జట్టు కూలీ పట్టిం నాగరాజు (30) ఇంజన్ టైర్ల కింద పడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మంగళవారం ఉదయం జట్టు కూలీలు నాగరాజు, అప్పన్న, కృష్ణలు డ్రైవర్ కలగా త్రిమూర్తులు ట్రాక్టర్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందినవాడు. కిర్రాపు శ్రీను పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సామర్లకోట ఎస్ఐ తోట సునీత దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి -యానాం

యానాం పట్టణపరిధిలో ఓ యువకుడు సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ శేరు నూకరాజు మంగళవారం తెలిపారు. పట్టణపరిధిలోని గొల్లల వీధికి చెందిన మరుకుర్తి రామకృష్ణ (21) తన స్వగృహంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు .స్థానికులు హుటాహుటిన జిజిహెచ్‌కు తరలించగా అప్పటికే మతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సివుందని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని, పల్లంకుర్రు మెయిన్ రోడ్డులో ట్రాక్టర్ దొంగతనం కేసులో ముగ్గురు యువకులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు కాట్రేనికొన ఎస్ఐ టి శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల16న రాత్రి పని ముగిసిన అనంతరం పల్లంకుర్రులో వెంకటేశ్వర స్వామి గుడి పక్కన గల ఖాళీ స్థలంలో తన ట్రాక్టర్, ట్రక్ ను పార్క్ చేసినట్లు ఫిర్యాదుదారుడు వాసంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. అప్పటికే ట్రాక్టర్ దొంగతనానికి పల్లంకుర్రు గ్రామానికి చెందిన పులుగు దశరథ మహారాజు, నాగళ్ళ శ్రీనివాస్ పథకం వేశారు. అప్పటికే ట్రాక్టర్ అమ్ముతామని పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన వరికోత మిషన్ యజమాని బొడేపు వినోద్ కుమార్ వద్ద రూ.2 లక్షల 69 వేలు మోసపూరితంగా పులుగు దశరథ మహారాజు,నాగళ్ళ శ్రీనివాస్ కాజేశారు. వినోద్ కుమార్ ఒత్తిడి చేయడంతో, ఫిర్యాదుదారుడు శ్రీనివాస రావుకి చెందిన ట్రాక్టర్, టక్ ను అర్ధరాత్రి పులుగు దశరథ మహారాజు,నాగళ్ళ శ్రీనివాస్ చోర్రీ చేశారన్నారు. దొంగతనం చేసిన ట్రాక్టర్‌ను వినోద్ కుమార్‌కు అప్పగించామన్నారు. వాసంశెట్టి శ్రీనివాస రావు ఫిర్యాదు మేరకు, కాట్రేనికోన ఎస్ కేసు నమోదు చేశారు. పల్లంకుర్రు నుంచి పార్వతిపురం వరుకు సిసి టీవీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. తక్కువ సమయంలో సిసి టీవీ కెమెరాల ద్వారా కేసు ఛేదించిన కాట్రేనికోన ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది కనకరాజు, మణికంఠలకు పలువురు అభినందనలు తెలిపారు.

చికిత్సపొందుతున్న బాధితులు

పిచ్చికుక్క దాడిలో 11 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట మండలం గంటి గ్రామం లో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఈ సంఘటనలో 11మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులను స్థానిక ఏరియా ఆసుపత్రిలో జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి, గొల్లపల్లి డేవిడ్ రాజ్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ రామన్, నాయకులు ఉన్నారు.ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి వైద్యులతో తో మాట్లాడి ఆస్పత్రిలోఉన్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు

50 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం నేలకోట రహదారి పురుషోత్తపట్నం గ్రామ శివారులో సారా తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఐ కె.శుభశేఖర్ పట్టుకుని, అతని వద్ద 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన బొమ్మిన వీరబాబు నాటు సారా తయారు చేసి, సింగవరం గ్రామానికి చెందిన మార్గాని సూరిబాబుకు చేరవేస్తుండగా పట్టుకున్నారు. 50 లీటర్ల నాటు సారా, బైకును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని పోలీసులు తెలిపారు.

నత్త నడకన 'నాడు-నేడు' పనులు...

హెచ్‌ఎంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.2.30 కోట్లతో ప్రారంభించిన "నాడు నేడు" పనులు గత సంవత్సర కాలంగా నిలిచి పోవడంపై పాఠశాల హెచ్‌ఎంను అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం నిలదీసింది. పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయమై మంగళవారం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు ఆధ్వర్యంలో ఎంపిడిఒ డి శ్రీ లలిత, ఎంఇఒ వై శివరామకష్ణయ్య, పిఆర్ జెఇ మణిమాల బందం పాఠశాలను సందర్శించి నిలిచిపోయిన పనులను పరిశీలించారు. కాగా పాఠశాలలో మరొక విభాగం పూర్తిగా శిథిలమై స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నందున దానిలోనికి విద్యార్థులు గాని, ఉపాధ్యాయులు కానీ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఎంకు ఎంపిపి సూచించారు. వాటి నిర్మాణానికి నిధుల మంజూరుకు సంబంధించి లెటర్ తయారు చేసి ఇస్తే, దానికి కృషి చేయనున్నట్టు ఎంపిపి చెప్పారు. ఈ సందర్భంగా పనుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పాఠశాల హెచ్‌ఎంకు ఎంపిపి, ఎంపిడిఒ పలు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సామర్లకోట మండల పరిధిలో అతిపెద్ద ఉన్నత పాఠశాల అయిన కొండపల్లి గంగన్న మెమోరియల్ జడ్‌పి ఉన్నత పాఠశాలలో 900 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్టు చెప్పారు. ఈ పాఠశాలలో 20 తరగతి గదుల నిర్మాణానికి రూ. 2.30 కోట్లు నాడు నేడు నిధులు మంజూరయ్యారన్నారు. దానిలో భాగంగా మొదటి విడతగా రూ.56 లక్షలు, రెండో విడతగా రూ.15 లక్షలు నిధులు విడుదల కాగా మూడు తరగతి గదుల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. వాటికి టైల్స్ ఏర్పాటు చేస్తే ఆ మూడు గదులు వినియోగంలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. మినహా 17 తరగతి గదులకు సంబంధించి నిర్మాణ పనులు ఏ విధంగానూ ముందుకు సాగక పోవడంపై ఆయన అసంతప్తి వ్యక్తం చేశారు. కాగా ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌ను ఫోన్లో ఆయన హెచ్చరించారు. రానున్న రెండు రోజుల్లో పనులను ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఎంపిపి చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తరగతిలో నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని విజయ్ మణిమాలకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన పనులను పరిశీలిస్తున్న ఎంపిపి, అధికారుల బృందం

వృద్ధ కళాకారులకు రూ.5 వేల పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వృద్ధ కళాకారులందరికీ నెలకు రూ 5 వేలు పింఛను ఇవ్వాలని ప్రజానాట్య మండలి మండల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సీనియర్ ప్రజానాట్యమండలి కళాకారుడు దారపురెడ్డి కృష్ణ అధ్యక్షతన మంగళవారం ప్రజానాట్య మండలి మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రొంగల వీర్రాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కళలు,కళారూపాల ప్రదర్శనలకు ప్రోత్సాహం లేకపోవడంతో కళా ప్రదర్శనలను నమ్ముకుని జీవనం గడిపిన కళాకారులందరూ కళారూపాలకు ఆదరణ లేక అవస్థలు పడుతున్నారన్నారు. వృద్ధాప్యంలో ఆదుకునే వారు లేక దీనస్థితిలో జీవనం గడుపుతున్నార న్నారు. గత మూడేళ్లుగా ప్రతి ఏడాది పింఛనుదారులకు పింఛను సొమ్ము పెంచినప్పటికీ కళాకారులకు మాత్రం పింఛను పెంచలేదన్నారు. కళాకారుల దుస్థితిని పరిగణలోకి తీసుకుని 60 సంవత్సరాల నిండిన వృద్ధ కళాకారులు అందరికీ నెలకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజానాట్య మండలి కళాకారులు దారపు రెడ్డి సత్యనారాయణ, గరగపాటి పెంటయ్య,నెక్కల నరసింహామూర్తి, అమత, నమ్రత, పూజిత, వివేక్, గౌస్, మహాపాతిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీర్రాజు

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న లయన్స్

క్రమం తప్పకుండా మందులు వాడాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిబి వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం త్వరితగతిని వ్యాధి నుండి బయటపడవచ్చని ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడివి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వైద్యాధికారి శైలజ సమక్షంలో టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రభాకర చౌదరి, కోట శ్రీనివాస చక్రవర్తి, ఆసుపత్రి సిబ్బంది కె భాస్కరరావు ఎస్‌వి రమణ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎంసి చైర్మన్ కుడుపూడి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎండియూడబ్ల్యూఎ) అధ్యక్షులు పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా తహశీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపిడిఒ ఎం. అనుపమ పాఠశాల చిన్నారులకు, ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డి బాబు, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, ఎండియూడబ్ల్యూఎ సంఘ కార్యదర్శి తాడి షణ్ముఖ రాజు, ఉపాధ్యక్షుడు మోకా ప్రసాద్, కర్నీడి వెంకటరమణ, నేరేడుమిల్లి స్వామి, కుడుపూడి మల్లేష్, సోను పాల్గొన్నారు.

యానాం వార్తలు

రోజుకు 100కు పైగా కరోనా పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు వందకు పైకి కరోనా పరీక్ష నిర్వహిస్తున్నామని ఆరోగ్యశాఖ డిడి టి.రవిశంకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వందకు పైగా కరోనా పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి కూడా కరోనా నిర్ధారణ కాలేదని తెలిపారు. ప్రస్తుతానికి 12 పాజిటివ్ కేసులు ఉన్నాయని అన్నారు. ఎవరికైనా కరోనా లక్షణాలు ఉన్నట్లయితే ఆసుపత్రిలో కరోనా పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

పలు ఆలయాల్లో ఎంఎల్ఎ పూజలు

యానాం నియోజకవర్గంలో కొలువై ఉన్న పలు గ్రామాల ఆలయ అమ్మవార్లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం దర్శించుకున్నారు.ఈ మేరకు స్థానిక ఫైర్ స్టేషన్ పక్కనున్న శ్రీ పోలేరమ్మ మహాలక్ష్మమ్మ ఆలయాన్ని ఎంఎల్ఎ అశోక్ తో పాటు ఆర్ఏవో మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్,డిటి సత్యనారాయణ తదితరులు దర్శించుకున్నారు. అనంతరం కనకాలపేట శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహెూత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సరిహద్దు గోడను పరిశీలిస్తున్న ఆర్ఏఒ మునిస్వామి

ఫిర్యాదులపై పరిశీలన

నియోజవర్గ పరిధిలోని పలు సమస్యలపై ఫిర్యాదుల రావడంతో మంగళ వారం ఆర్ఎఒ మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు యానాం పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న రైస్ మిల్ మధ్య సరిహద్దు గోడను సర్వే డిపార్ట్మెంట్ సిబ్బంది కిషోర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం గొలగాబత్తుల వారి వీధిలో ఒక ఇల్లు శిథిల స్థితిలో ఉండడంతో దానిని కూడా ఆయన పరిశీలించారు.

నేడు లయన్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన లైన్స్ క్లబ్ యానాం పిల్లరాయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుందని చార్టర్ ప్రెసిడెంట్ పులవర్తి వెంకటరమణమూర్తి తెలిపారు. స్థానిక జివిఎస్ పార్వతీశ్వరమ్మ మినీ గార్డెన్స్‌లో జరిగే ఈ సమావేశానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ మార్టూరి మంగతాయారు, ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునుస్వామి, ఎస్‌పి రఘునాయిగం, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, ఫాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డివిఎస్ రాజు హాజరవుతారని తెలిపారు.

దోమకాటుతో మలేరియా

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మలేరియా జ్వరం ఆడఅనాఫిలిస్ దోమ కుట్టడం వలన వస్తుందని డాక్టర్ సువర్ణరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ దోమ కుట్టిన పది రోజుల తర్వాత మలేరియా లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే సులభంగా దాడి చేస్తుందని అన్నారు. ఇది రక్తనాళాల్లో వద్ధి చెందుతుందని అన్నారు. జ్వరం, తలనొప్పి, చలి వంటి లక్షణాలు ఉంటాయి అని అన్నారు. జ్వరం తగ్గకపోతే మలేరియా నివారణకు పరీక్షలు జరిపి సత్వర చికిత్స పొందాలన్నారు. దోమలు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు . కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

వాణిజ్య ప్రాంతాల్లో సాయంత్రం వేళ పారిశుధ్య పనులు

మెయిన్ రోడ్డులో ట్రయల్ రన్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వాణిజ్య ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే క్రమంలో ఈవినింగ్ శానిటేషన్‌పై దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు. ఇందుకోసం కాకినాడ 8వ సర్కిల్లోని మెయిన్ రోడ్ ప్రాంతాన్ని ఎంపిక చేసి ట్రైల్ రన్ చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం ఆయన అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇందులో భాగంగా మెయిన్ రోడ్ లోని మసీదు నుంచి జగన్నాధపురం వంతెన వరకు, ఆ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అనుబంధ రహదారుల్లోనూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన ఈ ప్రాంతంలో రెండు వారాల పాటు ట్రైల్ రన్ కొనసాగించాలని, ఆ తరువాత మిగిలిన వాణిజ్య ప్రాంతాల్లో కూడా ఈ ప్రక్రియ కొనసాగించేలా చర్యలు తీసుకోవచ్చునని సూచించారు. ఒక ట్రాక్టర్, ఇద్దరు పారిశుధ్య కార్మికులను ఏర్పాటుచేసి వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభించాలని కమిషనర్ సూచించారు. ఈ విషయంలో ఆయా సచివాలయ కార్యదర్శులు క్రియాశీలకంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అనంతరం నగరంలోని డి-సిల్టేషన్ పనులపై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల అధికారులతో సమీక్షించారు. పూడికతీత పనులను ఇంజనీరింగ్ విభాగంతో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్లు కూడా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి. సత్య కుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-మండపేట

నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. మంగళవారం ద్వారపూడి శివారు వేములపల్లి జగనన్న కాలనీలో జగనన్న హౌసింగ్ స్కీంలో భాగంగా రూ.280.15 లక్షల అంచనా విలు వతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఇటీవల రాయవరం మండలంలోని సోమేశ్వరంలో సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసామన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, జెడ్‌పిటిసి సభ్యురాలు కురుపూడి భవాని, ఎంపిపి ఉండమట్ల వాసు, సర్పంచులు ఈతకోట కిన్నెర, గారపాటి సౌజన్య అశోక్, తులా శేషారావు, సొసైటీ చైర్ పర్సన్ దంతులూరి శ్రీరామ వర్మల, విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లాల ఎస్ఇ టివిఎస్ ఎన్.మూర్తి, విద్యుత్ శాఖ అధికారులు దాట్ల శ్రీధర్ వర్మ, జి. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపనలో ఎంఎల్‌సి తోట

జిల్లాలో విద్యుత్ కోతలు ఉండవు

జిల్లాలో విద్యుత్ కోతలు ఉండవని విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లాల ఎస్ఇ.టివివిఎస్ఎన్ మూర్తి అన్నారు. మంగళవారం సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ద్వారపూడి వచ్చిన ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 18.05 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం ఉండగా మే నెలనాటికి 21.05 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందన్నారు. 980 మెగా వాట్స్ ఉండగా 1100 మెగా వాట్స్ కు పెరిగే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 220 సబ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 సబ్ స్టేషన్లకు గాను 24 జగనన్న కాలనీలలోను 12 డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఒక్కక్కదానికి రూ.3 కోటతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, లోవోల్టేజ్ తదితర సమస్యలు అధిగమించడంలో భాగంగా ఇప్పటికే 1000 ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఉంచుకున్నామన్నారు. వీటిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 8 ఉన్నాయన్నారు.సబ్ స్టేషన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనులు నిరంతరం జరుగుతాయన్నారు. ఆయన వెంట రామచంద్రపురం డిఇ దాట్ల శ్రీధర్ వర్మ, ఎడి జి.తిరుమలరావు, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

గ్రామ స్థాయిలో ఓటర్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి-రావులపాలెం

టిడిపి శ్రేణులు గ్రామాల్లో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర టిడిపి కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు కోరారు. మంగళవారం స్థానిక రావులపాలెంలోని కాపు కళ్యాణ మండపంలో ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాలకు సంబంధించి క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులుకు ఓటర్ వెరిఫికేషన్ తదితర విషయాల మీద ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రావులపాలెం మండల టిడిపి అధ్యక్షులు గుత్తుల పట్టాభిరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ఓటరు వెరిఫికేషన్ ద్వారా గ్రామాల్లో చనిపోయిన ఓటర్లను తీసివేయటం, కొత్త ఓటర్ల నమోదు, కుటుంబాల వారిగా విడిపోయిన ఓటర్లను హౌస్ మ్యాపింగ్ చేయడం సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కంఠం శెట్టి శ్రీనివాసరావు, ముదునూరి వెంకటరాజు,మెర్ల గోపాలం, పోల్ కోఆర్డినేటర్ ముత్యాల బాబ్జి, క్లస్టర్ ఇన్చార్జిలు చిలువూరి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై హెచ్‌ఎంలకు శిక్షణ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండల వనరుల కేంద్రం లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు మంగళవారం సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి కె.తాతారావు అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఐడి కోఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీలోపు పాఠశాలల్లో పిఎంసి సమావేశాలు నిర్వహించి పాఠశాలలకు అవసరమైన అవసరమైన విషయాలను, సోషల్ ఆడిట్ యాప్ నందు తల్లిదండ్రుల సమక్షంలో ప్రశ్నావళి పూర్తి చేయాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యకమంలో రిసోర్స్ పర్సన్స్ ఎ. లక్ష్మీనారాయణ, రాజు, ప్రధానోపాధ్యాయులు, మండల సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తపేట** మండల విద్యాశాఖ కార్యాలయం నందు సోషల్ ఆడిట్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి ఎం. హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వాడపాలెం గ్రామంలో విలేకరుల సమావేశం మాట్లాడుతూ వైసిపి ఏప్రిల్ 7న రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సచివాలయాలలో జగనన్నే మాభవిష్యత్తు పేరుతో మెగా పీపుల్ సర్వేను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ సైనికులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిని సందర్శించి, కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 3500 మంది పార్టీ సైనికులు గహ సారథులుగా, 260 మంది గ్రామ సచివాలయ కన్వీనర్లుగా ప్రతీ ఇంటికీ వెళ్ళి ప్రజాభిప్రాయ సేకరణ చేసిందన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతీ కుటుంబం జగనన్నే మా భవిష్యత్తు అని ముఖ్త కంఠంతో చెప్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మార్గాన గంగాధరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదే తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి డైరెక్టర్ నాగేశ్వరమ్మకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడి వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా తాళ్ళరేవు మండలం నుంచి నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సంగాని వీర నాగేశ్వరమ్మ, సంగాని దాసు దంపతులను మంగళవారం కోరంగి పంచాయతీ సీతారామపురం మరిడమ్మ ఆలయం వద్ద స్థానికులు దుశ్శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీతారాంపురం, ప్రతాప్ నగర్, కోరంగి గ్రామాలకుకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

వీర నాగేశ్వరమ్మ, దాసు దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి-అయినవిల్లి

వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గా అయినవిల్లి గ్రామానికి చెందిన కాకిలేటి శ్రీనివాస్ నియమితులయ్యారు ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తనపై నమ్మకం ఉంచి ఈ పదవి బాధ్యతలు అందించిన పి. గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబుకి కతజ్ఞతలు తెలిపారు అనంతరం ఎంఎలఎ చిట్టిబాబును శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో శానపల్లిలంక సొసైటీ ఛైర్మన్ మట్టపర్తి రామారావు, శానపల్లిలంక గ్రామ శాఖ అధ్యక్షులు పీతాని వెంకటేశ్వరావు, దొమ్మేటి దుర్గారావు పార్టి నాయకులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

వేసవిలో అపరాలు వేసుకున్న రైతులు వాటి వివరాలతో రైతు భరోసా కేంద్రాల వద్ద పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.నాగేశ్వరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని అంగర రైతు భరోసా కేంద్రం వద్ద మండల గ్రామ వ్యవసాయ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఆ శాఖకు సంబంధించి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించిందన్నారు. ఆ ధరకు విక్రయించుకున్న రైతులు వివరాలను ధాన్యం కొనుగోలు లాగిన్ లో ఆ సర్వే నంబర్లను బ్లాక్ చేయాలన్నారు . అధిక ధర వస్తే రైతు బహిరంగంగా బయట మార్కెట్‌కు కూడా అమ్ముకోవచ్చు అన్నారు. అలా అమ్మిన సర్వే నంబర్లను ధాన్యం కొనుగోలు లాగి లో బ్లాక్ చేయాలన్నారు. అలా బ్లాక్ చేయడం ద్వారా ఆ సర్వే నంబర్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం లో పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు, జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు వేసుకోవాలని తెలిపా రు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కెవిఎన్,రమేష్ కుమార్, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి ఆధ్వర్యంల పలుచోట్ల మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపినాయకులు పాల్గొని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వివరాలు ఇవి..

పెద్దాపురం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్నారు. పన్నులు పెంచడం,ధరలు పెంచడం తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించ బడలేదన్నారు. అన్ని ప్రాంతాలలో రహదారుల అధ్వాన్నంగా ఉన్నాయన్నారు .రాష్ట్ర అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఎలిశెట్టి నాని,నూనె రామారావు,సింగన అరవింద కుమార్, బళ్ల రాంబాబు,తలాటం రాంబాబు,శివ బాబు,శ్రీను తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం నడవపల్లి పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, తూర్పు పేట, నడవపల్లి మెయిన్ ,కొళాయి చెరువు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దాట్ల బుచ్చిబాబు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసిపిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు జొన్నాడ రాజారావు ఆధ్వర్యంలో కుళాయి చెరువు ప్రాంతానికి చెందిన 30 మంది పార్టీలో చేరారు. వీరికి బుచ్చిబాబు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. **రామచంద్రపురం** పట్టణం లోని 22వ వార్డులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పట్టణ టిడిపి అధ్యక్షులు కడియాల రాఘవన్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గరికపాటి సూర్యనారాయణమూర్తి, క్లస్టర్ ఇన్ ఛార్జ్ మేడిశెట్టి సూర్యనారాయణ తదితరులుపాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ

ప్రజాశక్తి - ఆలమూరు

గుమ్మిలేరులో అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి రూ. 16 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. దీంతో సర్పంచ్ గుణ్ణం రాంబాబు నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

ఆలమూరుకు చెందిన గండేటి దుర్గ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. షయం తెలుసుకున్న మండలంలోని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు మంగళవారం స్పందించి బాధిత కుటుంబానికి కొంత మొత్తంలో నగదును దీంతో పాటుగా 25 కేజీల బియ్యాన్ని వారి అందించారు.

ప్రాథమిక దశలో వ్యాధులు గుర్తించాలి

ప్రజాశక్తి -మండపేట

ప్రాథమిక దశలో వ్యాధులు గుర్తించడమే మేలని వైద్యులు సుమంత్, గీతా శ్రవణ్ లు అన్నారు. మంగళవారం స్థానిక కళ్యాణ మండపంలో పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సులో వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నేటి వైద్య విధానంలో రోగికి వైద్యాధించడం సులువన్నారు. నేటి జీవనశైలిలో ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మానసిక ఒత్తిడిలేని జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పిఎంపి అసోషియేషన్ నాయకులు కోన సత్యనారాయణ, బివి.రమణ, వికె.రాజు, ఎ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుని మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాజుపాలెం కు చెందిన శతాధిక వృద్ధుడు పొత్తూరి సత్యనారాయణ రాజు (104) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. సత్యనారాయణ రాజుకు భార్య వెంకాయమ్మ, కుమారులు వెంకటపతి రాజు, సత్యనారాయణ రాజం రాజు, కుమార్తె అమ్మాజీ, మనుమలు, మునిమనుమలు ఉన్నారు. శతాధిక వృద్ధుడు సత్యనారాయణ రాజు మృతికి సర్పంచ్ కుంచే చిట్టికుమారి, ఎంపిటిసి సభ్యులు నడింపల్లి విజయలక్ష్మి, అంగాని అనంతలక్ష్మి,సొసైటి అధ్యక్షులు నడింపల్లి వాసురాజు తదితరులు సంతాపం తెలిపారు.